సాక్షి గుంటూరు

బుధవారం । 19 । మార్చి । 2025



నేడు పునీత జోజప్ప మహోత్సవం

పెదకూరపాడు: పునీత జోజప్ప మహోత్సవ ఏర్పాట్లతో జలాలపురం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. బుధవారం సమష్టి దివ్య పూజా బలి నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 518.80 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విజయవాడ భవానీపురానికి చెందిన కనమర్లపూడి రామకృష్ణ, సౌమిత్రి పద్మవల్లి రూ. 1,00,116 విరాళాన్ని అందజేశారు.



న్యూస్‌రీల్

వసతి గృహాల తనిఖీ



గుంటూరు లీగల్: క్యాలెండరు యక్టివిటీస్‌లో భాగంగా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు మంగళవారం గుంటూరు మహిళా ప్రాంగణంలోని ఎస్టీ బాలికల పాఠశాల, వసతి గృహాన్ని, ఎస్టీబాలికల కళాశాల వసతి గృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడారు. వారికి అందుతున్న సదుపాయాల గురించి, ఆహార నాణ్యత గురించి తెలుసుకున్నారు. అనంతరం స్కూల్ వసతి గృహం వార్డెన్ జి.హిమ శిల్ప, కళాశాల వార్డెన్ రాజేశ్వరిలను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

1,33,222 బస్తాలు మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,28,999 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,33,222 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,500 నుంచి రూ.13,800 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 63,975 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

బీఈడీ పేపర్ లీకేజ్ నిందితులకు బెయిల్

గుంటూరు లీగల్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం బీఈడీ పేపర్ లీకేజీ విషయంపై పెద్దకాకాని పోలీస్ స్టేషన్లో నమోదు చేసిన కేసులో ఏడుగురు నిందితులను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. ఈ ఏడుగురికీ బెయిల్ మంజూరు చేస్తూ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో విచారణ జరగాల్సి ఉంది.

సామాజిక బాధ్యతతో వాహనాలు నడపాలి



పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతను గుర్తెరిగి వాహనాలు నడపాలని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ సూచించారు. గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో హిందూ కళాశాల కూడలి వద్ద జరిగిన ప్రత్యేక వాహన తనిఖీల్లో(స్పెషల్ డ్రైవ్‌లో) ఎస్పీ సతీష్‌కుమార్ పాల్గొన్నారు. తనిఖీలు చేపట్టి వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సూచనలు, సలహాలు ఇచ్చారు. బైక్‌లపై విన్యాసాలు చేస్తున్న ఏడుగురిపై కేసు నమోదు చేశారు. వీరి వాహనాలు సీజ్ చేసి కోర్టులో ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. స్పెషల్ డ్రైవ్‌లో ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్, ట్రాఫిక్ సీఐలు సింగయ్య, అశోక్ కుమార్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఠలాటకం



- కౌన్సిల్ ఎవరు నిర్వహించాలి ?
- కొనసాగుతున్న సందిగ్ధం
- మేయర్ రాజీనామాపై చర్చించేందుకు ఈనెల 20న కౌన్సిల్
- సీనియర్ డెప్యూటీ మేయర్‌గా డైమండ్ బాబు
- టీడీపీలో ఉన్నందున సజిలకు ఇవ్వాలంటున్న కూటమి నేతలు
- ఏం చేయాలో చెప్పాలని ప్రభుత్వానికి కమిషనర్ లేఖ
- ఇంకా స్పందించని సర్కారు
- మేయర్ పీఠం కోసం కూటమిలో అంతర్గత కుమ్ములాట



సాక్షి ప్రతినిధి, గుంటూరు, నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థ కౌన్సిల్ ఎవరు నిర్వహించాలనే సందిగ్ధత గుంటూరు కార్పొరేషన్‌లో నెలకొంది. మేయర్ పదవికి కావటి మనోహర్‌నాయుడు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ రాజీనామా ఆమోదం కోసం కౌన్సిల్ సమావేశం ఈ నెల 20న నిర్వహించనున్నారు. అయితే ఇద్దరు డెప్యూటీ మేయర్లు ఉన్న నేపథ్యంలో సభ ఎవరు నిర్వహించాలనే విషయంపై సందిగ్ధత నెలకొంది. గతంలో పాలక వర్గం ఎన్నికైన వెంటనే మేయర్‌గా కావటి మనోహర్ నాయుడు, డెప్యూటీ మేయర్‌గా వనమా బాలవజ్రబాబు(డైమండ్‌బాబు)ను కౌన్సిల్ సభ్యులు ఎన్నుకున్నారు. ఆ తర్వాత నాలుగు నెలలకు ఇద్దరు డెప్యూటీ మేయర్లకు అప్పటి ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. దీంతో రెండో డెప్యూటీ మేయర్‌గా షేక్ సజిలాను ఎన్నుకున్నారు. ఈ ప్రకారం చూస్తే డైమండ్‌బాబుకు నాలుగు నెలల సీనియారిటీ ఉంది. ఈ నేపథ్యంలో డైమండ్‌బాబును ఇన్‌చార్జ్ మేయర్‌గా పీఠంపై కూర్చోపెడితే తమకు ఇబ్బందులు వస్తాయని భావించిన కూటమి నేతలు ఇప్పటికే తెలుగుదేశం పార్టీలో చేరిన షేక్ సజిలకు అవకాశం ఇవ్వాలని కమిషనర్‌పై ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో కమిషనర్ ఈ విషయంపై నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి లేఖ రాశారు. అయితే ఇప్పటి వరకూ దీనికి సర్కారు నుంచి సమాధానం రాలేదు. బుధవారం కూడా సమాధానం రాకుంటే కౌన్సిల్ సమావేశం వాయిదా పడే అవకాశం ఉంది. కౌన్సిల్‌లో చర్చించి నిర్ణయం తీసుకున్న తర్వాతే కొత్త మేయర్ ఎన్నికల షెడ్యూల్ కోసం ఎన్నికల సంఘానికి పంపించాల్సి ఉంటుంది.

మేయర్ పీఠంపై కూటమిలో రగడ

మరోవైపు కూటమిలో మేయర్ పీఠం కోసం అంతర్గత కుమ్ములాట మొదలైంది. తెలుగుదేశంపార్టీలో రెండు వర్గాలు పదవి కోసం పోటీ పడుతున్నాయి. జనసేన కూడా తమకు అవకాశం ఇవ్వాలని, లేకుంటే డెప్యూటీ మేయర్ ఇవ్వాలని పట్టుపడుతోంది. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఇప్పటికే మేయర్ అభ్యర్థిత్వం విషయంలో అధిష్టానం కోవెలమూడి రవీంద్ర(నానీ) పట్ల సానుకూలంగా ఉందంటూ ప్రకటన చేశారు. ఈ ప్రకటన చేసిన రోజునే ఇద్దరు ఎమ్మెల్యేలతోపాటు తొమ్మిది మంది కార్పొరేటర్లు సమావేశం నుంచి నిరసనగా బయటకు వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. చంద్రబాబు, లోకేష్ కూడా నానీకి అవకాశం ఇవ్వాలన్న ఉద్దేశంతో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాత్రమే నాని అభ్యర్థిత్వానికి అనుకూలంగా ఉండగా, పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌లు వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికే గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవికి, కోవెలమూడి నానికి ఆధిపత్య పోరు నడుస్తోంది. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటు కోవెలమూడి నానిని కాదని గల్లా మాధవికి ఇవ్వడంతో ఆయన కావాలనే మాధవిని ఓడించేందుకు యత్నాలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో మాధవి వర్గం వేములపల్లి శ్రీరాంప్రసాద్(ఇసుక బుజ్జి)ని మేయర్‌గా చేయాలని పట్టుపడుతోంది. తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ కూడా బుజ్జి వైపే మొగ్గుచూపుతున్నట్లు ప్రచారం నడుస్తోంది.

కాపు సామాజికవర్గం పోటీ

ఇప్పటి దాకా మేయర్‌గా ఉన్న కావటి కాపు సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో ఆ వర్గం కార్పొరేటర్లు మేయర్ సీటుకు పోటీ పడుతున్నట్లు సమాచారం. కాపులకే మేయర్ పీఠం ఇవ్వాలని కాపు సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్లు, ఇప్పటికే జనసేనలో చేరిన ఓ వర్గం పవన్ కళ్యాణ్ వద్ద మంతనాలు చేస్తున్నట్లు సమాచారం. వైఎస్సార్‌సీపీ నుంచి జనసేనలోకి చేరిన కాపు సామాజిక వర్గానికి చెందిన నిమ్మల వెంకట రమణ, యర్రి ధనలక్ష్మీ కూడా మేయర్ పీఠం కోసం యత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరో పక్క బీసీలు, మైనార్టీలలో ఆశావాహులు పెరిగిపోతుండటంతో కూటమి పెద్దలకు మేయర్ సీటు అంశం తలనొప్పిగా మారింది.



భారీగా చేరుకున్న అభిమానులకు అభివాదం చేస్తున్న వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

వైవీ మాతృమూర్తికి కన్నీటి వీడ్కోలు

- వైవీ సుబ్బారెడ్డి తల్లి అంత్యక్రియలకు మేదరమెట్లకు వచ్చిన జగన్
- సుబ్బారెడ్డి తల్లి పిచ్చమ్మ భౌతిక కాయానికి నివాళులు
- కుటుంబ సభ్యులకు పరామర్శ
- అర్ధగంటపాటు అక్కడే గడిపిన జననేత

సాక్షి ప్రతినిధి,బాపట్ల: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ సోమవారం ఒంగోలులో మృతిచెందగా స్వగ్రామం మేదరమెట్లలో ఆమె అంత్యక్రియలు మంగళవారం బంధువులు, పార్టీశ్రేణుల అశ్రునయనాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర నలుమూలల నుంచి పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తమ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారని తెలుసుకొని వేలాదిగా కార్యకర్తలు, అభిమానులే కాదు సామాన్య జనమూ తరలి వచ్చారు. ఎంతగా అంటే జనం తాకిడికి జగన్ కాన్వాయ్ ముందుకు కదలలేకపోయింది. ఆ తర్వాత జగన్ వైవీ ఇంటికి చేరుకొని అక్కడ సుబ్బారెడ్డి తల్లి పిచ్చమ్మ భౌతిక కాయానికి నివాళులర్పించి చిన్నాన్న వైవీ.సుబ్బారెడ్డి, చిన్నమ్మ స్వర్ణమ్మ, చిన్నాన్నలు వైవీ భద్రారెడ్డి, హనుమారెడ్డి, సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్‌రెడ్డిలతో పాటు వారి కుటుంబ సభ్యులందరినీ పరామర్శించారు. భుజంతట్టి ఓదార్చారు. అక్కడే ఉన్న తల్లి విజయమ్మ, మేనమామ రవీంద్రనాథరెడ్డి ఇతర బంధువులతో మాట్లాడారు. అర్ధగంట పాటు అక్కడే ఉన్న వైఎస్ జగన్ కుటుంబ సభ్యులతో గడిపారు. వైఎస్సార్ సీపీ నేతలను పేరుపేరునా పలకరించారు. వైవీ ఇంటి నుంచి జగన్ తిరుగు ప్రయాణంలోనూ ఆయన వాహనం ముందు చేరిన కార్యకర్తలు, అభిమానులు నినాదాలతో హోరెత్తించారు. పిచ్చమ్మ భౌతికకాయానికి వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున, మాజీ ఉపముఖ్యమంత్రి మంత్రి నారాయణస్వామి, మాజీ మంత్రులు కారుమూరు నాగేశ్వరరావు, ఆదిమూలపు సురేష్, అంబటి రాంబాబు, విడదల రజని, జోగి రమేష్, ప్రకాశం జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ముస్తాఫా, బుర్రా మధుసూదనయాదవ్, జంకె వెంకటరెడ్డి, టీజేఆర్ సుధాకర్‌బాబు, పార్టీ నాయకులు కరణం వెంకటేష్, గాదె మధుసూదన్‌రెడ్డి, వరికూటి అశోక్ బాబు, మేరిగ మురళి, చుండూరు రవి, పానెం చిన హనిమిరెడ్డి తదితరులు నివాళులర్పించారు.

ఓటరు కార్డులకు డోర్ నంబర్లు సరిగా ఉండాలి

కలెక్టర్ నాగలక్ష్మి



ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: ఓటరు కార్డులకు డోర్ నంబర్లు సక్రమంగా ఉండేలా పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారులు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆధార్‌కు, డోర్ నంబరుకు సంబంధం లేకుండా కొన్ని సందర్భాల్లో జరుగుతోందన్నారు. రాజకీయ పార్టీల సూచనలు పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో డీఆర్వో షేక్ ఖాజావలి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

బాలల సంక్షేమానికి మరింత కృషి అవసరం

జిల్లాలో బాలల సంరక్షణ పథకాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేసి సత్ఫలితాలు సాధించేందుకు అధికారులు మరింత కృషి చేయాలన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. బాలల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ ఎం.ఉమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డీఈఓ రేణుక, డీపీఓ సాయికుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల ఉద్యోగోన్నతి కౌన్సెలింగ్‌లో చేతివాటం

గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా 266 మంది ఏఎన్‌ఎంలకు గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సోమవారం ఉద్యోగోన్నతి కౌన్సెలింగ్ జరిగింది. సోమవారం ఉదయం నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు జరిగిన ఈ కౌన్సెలింగ్‌లో పలువురు కార్యాలయ ఉద్యోగులు, యూనియన్ నాయకులు ప్రమోషన్ పొందిన ఏఎన్‌ఎంల నుంచి అందిన కాడికి దండుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏఎన్‌ఎంలకు ప్రమోషన్ ఆర్డర్స్ ఇచ్చేందుకు కింది స్థాయి ఉద్యోగులు ఒక్కో ఏఎన్‌ఎం నుంచి రూ. 500 నుంచి రూ.వెయ్యి వరకు ముక్కుపిండి వసూలు చేశారని పలువురు ఆవేదన చెందారు. ప్రమోషన్ ఆర్డర్ కాపీలు కేవలం ఒక్కటి మాత్రమే అందజేసి మిగతా కాపీలు జిరాక్స్ తీపించుకోవాలని అర్ధరాత్రి వేళ ఆందోళనకు గురి చేశారని పేర్కొన్నారు.

కోరుకున్న చోటు దక్కితే రూ.5వేలు!

ఏఎన్‌ఎంలు కోరుకున్న చోటు దక్కితే రూ. 5వేల వరకు యూనియన్ నాయకులు, కార్యాలయ ఉద్యోగులు వసూలు చేసినట్లు పలువురు ఏఎన్‌ఎంలు ఆరోపించారు. డబ్బులు ముట్టచెప్పిన వారికి కోరుకున్న చోట ప్రమోషన్ ఆర్డర్స్ ఇచ్చారని, మామూళ్లు ఇవ్వనివారికి కోరుకున్న ప్రాంతాలు ఖాళీగా ఉన్నా చూపించలేదని ఆవేదన చెందారు. ఉద్యోగోన్నతి ఉత్తర్వుల్లోనూ తప్పిదాలు ఉన్నాయని, ఒక ప్రాంతంలో పనిచేస్తుంటే, మరోప్రాంతంలో పనిచేస్తున్నట్లుగా పేర్కొన్నారని వివరించారు.

క్రేన్ సంస్థలపై ఆదాయ పన్ను శాఖ దాడులు



సంపత్ నగర్‌లోని క్రేన్ సంస్థల అధినేత ఇంటి ముందు ఆగి ఉన్న ఐటీ శాఖ అధికారుల వాహనాలు

- 18 మంది బృందంతో తనిఖీలు
- ఫ్యాక్టరీలు, బంధువుల ఇళ్లలో సోదాలు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరులో క్రేన్ సంస్థలపై ఆదాయ పన్ను శాఖ మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించింది. పొత్తూరు, సంపత్‌నగర్ ప్రాంతాలలో ఉన్న ఫ్యాక్టరీలలో అధికారులు సోదాలు చేశారు. గుంటూరు, విజయవాడ ప్రాంతాలకు చెందిన ఆదాయపన్ను శాఖ అధికారులు మొత్తం 18 మంది ఓ బృందంగా దాడులు నిర్వహించారు. క్రేన్ అధినేత ఫ్యాక్టరీలు, బంధువుల ఇళ్లల్లో విస్తృత తనిఖీలు జరిగాయి. తనిఖీల సమయంలో అధికారులు క్రేన్ సంస్థల సిబ్బంది సెల్ ఫోన్లు సీజ్ చేశారు. మంగళవారం రాత్రి అంతా తనిఖీలు కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

జేబుర్దస్త్



రాంగ్‌రూట్‌లో ట్రాఫిక్

- సిబ్బంది అవినీతితో అప్రతిష్టపాలు
- చలానాల సొమ్ము జేబులో వేసుకున్న ఎస్‌ఐ
- ప్రభుత్వం వాహనం వాడుకుంటున్న కానిస్టేబుల్
- రైటర్‌గా వ్యవహరిస్తున్న కానిస్టేబుల్‌పై ఆరోపణల పరంపర

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగర ట్రాఫిక్ విభాగంలో కొందరు అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు పోలీసు శాఖను అప్రతిష్టపాలు చేస్తోంది. వారి అవినీతి అడ్డూఅదుపూ లేకుండా సాగుతోంది. గుంటూరు నగర ట్రాఫిక్ పరిధిలో ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐలు, వెస్ట్ సబ్‌డివిజన్‌లో ముగ్గురు ఎస్‌ఐలు, ఈస్ట్ సబ్ డివిజన్‌లో ఇద్దరు ఎస్‌ఐలు ఉన్నారు. ఒక ఎస్‌ఐ ప్రమాదంలో గాయపడి సిక్‌లో ఉన్నారు. ఈస్ట్, వెస్ట్ సబ్‌డివిజన్లలో కలిపి మొత్తం ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు కలిపి సుమారు 80 మందికిపైగా విధులు నిర్వర్తిస్తున్నారు. ట్రాఫిక్ ఎస్‌ఐలకు ఒక ప్రాంతాన్ని కేటాయించి ఒక అసిస్టెంట్‌ను ఇస్తారు. నిత్యం కేసులు రాయటంతో పాటు, ఆయా ప్రాంతాల్లో జరిగే ప్రమాదాలకు సంబంధించిన అంశాలను ఎస్‌ఐ చూడాల్సి ఉంటుంది. అయితే కొందరు ఎస్‌ఐలు అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

చలానాల సొమ్ము బొక్కేశారు

వెస్ట్ సబ్‌డివిజన్ పరిధిలోని లాడ్జి సెంటర్, అమరావతి రోడ్డు, కొరిటెపాడు రోడ్డు చూసుకునే ఒక ఎస్‌ఐ, అతని అసిస్టెంట్ అవినీతి పరాకాష్టకు చేరింది. ద్విచక్ర వాహనాలు, ఆటోలను తనిఖీలకు ఆపిన సమయంలో పెండింగ్ చలానాలు ఉంటే.. వారిని భయపెట్టి మరీ వారి వద్ద నగదు తీసుకుని, ఆ డబ్బు చలానాలకు జమ చేయకుండా జేబులు నింపుకుటున్నారని ఆ శాఖ సిబ్బంది బాహాటంగానే చెప్పుకుంటున్నారు. వీరు డబ్బు తీసుకున్న వాహనాలను మరో ఎస్‌ఐ ఆపి చలానాలు కట్టాలని అడిగితే వాహనదారులు ఇంతకుముందే ఓ ఎస్‌ఐకు కట్టామని చెప్పడంతో పోలీసులే విస్తుపోతున్నారు. ఇలా పలు ఫిర్యాదులు రావడంతో పరువు పోతుందనే భయంతో ఆ ఎస్‌ఐ, అతని అసిస్టెంట్ దిగమింగిన డబ్బులు చెల్లించిన ఘటనలూ ఉన్నాయని సిబ్బంది చెబుతున్నారు.

ప్రభుత్వ పెట్రోల్ వాడేసుకుంటున్నాడు!

వెస్ట్ ట్రాఫిక్ పరిధిలోనే ట్రాఫిక్ ఉన్నతాధికారి వద్ద పనిచేస్తూ జిల్లాలోని మరో పోలీసుస్టేషన్‌కు బదిలీ అయిన కానిస్టేబుల్ ప్రభుత్వ ద్విచక్రవాహనాన్ని సొంతానికి వాడేసుకుంటున్నాడు. నెలకు ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే 30 లీటర్ల పెట్రోల్‌ను సొంత అవసరాలకు ఉపయోగిస్తున్నాడు. ఇక్కడ సుమారు తొమ్మిదేళ్ల పాటు పని చేసిన అతను బదిలీ అయినా ఇక్కడే తిష్టవేసి నెలవారీ వసూళ్ళు, ఎన్‌ఓసీ జారీల్లో చేతివాటం చూపిస్తున్నాడని సిబ్బంది బాహాటంగానే చెబుతున్నారు. బదిలీ అయిన తర్వాత కూడా రెండు, మూడు సార్లు ప్రభుత్వం ద్వారా ఉచితంగా పెట్రోల్ వినియోగించినట్టు తెలుస్తోంది.

పరువు 'బజారు'పాలు

గుంటూరు ఈస్ట్ పరిధిలో ఒక ఎస్‌ఐ, అతని అసిస్టెంట్‌లపైనా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీరు పట్నంబజారు, మార్కెట్, పూలమార్కెట్, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం తదితర ప్రాంతాల్లో అవినీతికి పాల్పడుతూ పరువును బజారుకీడ్చుస్తున్నట్టు సమాచారం. నిత్యం కేసులు నమోదు చేస్తూ.. అటుగా వచ్చే భారీ వాహనాల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శలు ఉన్నాయి. చిరు వ్యాపారులపైనా ప్రతాపం చూపించి భారీగా దండుకుంటున్నారని తెలుస్తోంది.

రాత'కోతల' రైటర్

మరో కానిస్టేబుల్ నేరుగా రైటర్ అవతారం ఎత్తాడు. స్టేషన్‌లో తానే రైటర్‌నని, స్టేషన్ అధికారి పనులన్నీ కూడా తానే చక్కబెడతానంటూ చెప్పుకుంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడని విమర్శలు వినిపిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం విద్యానగర్ సమీపంలో ఒక వైద్యుడి వాహనాన్ని, ఒక ద్విచక్ర వాహనదారుడు వచ్చి ఢీకొట్టాడు. వైద్యుడు ఫిర్యాదు చేసిన క్రమంలో సీఐ కేసు కట్టాలని చెప్పినప్పటికీ, సదరు రైటర్ మాత్రం రూ.5వేలు ఇచ్చే వరకు కేసు నమోదు చేయలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆఖరికి స్పెషల్ డ్రైవ్‌లో తీసుకు వచ్చిన వాహనాలూ కోర్టు వెళితే శిక్ష పడుతుందంటూ వేలాది రూపాయిలు గుంజుకుని వాహనాలు వదలి పెడుతున్నాడని తెలుస్తోంది.

అవినీతికి పాల్పడితే చర్యలు

ట్రాఫిక్ విభాగంలో అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడితే కచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటాం. పలు విషయాలు మా దృష్టికీ వచ్చాయి. అక్రమ వసూళ్ళకు పాల్పడే వారి గురించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటాం.

–ఎం.రమేష్, (డీఎస్పీ, ట్రాఫిక్)

ఏఎన్‌యూ దూరవిద్య కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ 2025 విద్యాసంవత్సరానికి సెమిస్టర్ విధానంలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ ఇప్పటికే విడుదల చేసినట్లు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. గడువు ఈనెల 31తో ముగుస్తుందని చెప్పారు. న్యూఢిల్లీ, యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్, డెబ్ (డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో) అనుమతి కలిగి యూజీ, పీజీ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పీజీ ఆర్ట్స్ 11 కోర్సులు, యూజీ ఆర్ట్స్ 9 కోర్సులు, పీజీ కామర్స్ మేనేజ్మెంట్ ప్రోగ్రామ్స్ 3 కోర్సులు, యూజీ కామర్స్ మేనేజ్మెంట్ ప్రోగ్రామ్స్ 3 కోర్సులు, లైబ్రరీ ప్రోగ్రామ్స్ 2 కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. పీజీ సైన్స్ విభాగంలో ఎమ్మెస్సీ బోటని, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషనల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, ఎమ్మెస్సీ సైకాలజీ, ఎంసీఏ తదితర 11 సైన్స్ కోర్సులలో ప్రవేశం పొందే దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌యూసీడీఈ.ఇన్‌తోపాటు ఫోన్ నంబర్స్ – 98484 77441, 0863–2346323 సంప్రదించవచ్చుని తెలిపారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 7,600 గరిష్ఠం : రూ. 9,500

మోడల్ ధర రూ. 8,700

క్లుప్తంగా

పీఎం యోగా అవార్డుకు దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి యోగా అవార్డు–2025కు అర్హత కలిగిన పౌరుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు యువజన సర్వీసుల శాఖ, స్టెప్, స్వశక్తి సీఈవో ఆర్.చంద్రమౌని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. యోగా ప్రచారం, అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేసిన వ్యక్తులు, సంస్థలు అవార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జాతీయ వ్యక్తి, జాతీయ సంస్థ, అంతర్జాతీయ వ్యక్తి, అంతర్జాతీయ సంస్థ కేటగిరీల వారీగా దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ విభాగాలకు వ్యక్తిగత కేటగిరీలో దరఖాస్తుదారునికి కనీస వయో పరిమితి 40 ఏళ్లు ఉండాలని, యోగా ప్రచారం, అభివృద్ధికి కనీసం 20 ఏళ్లు సేవ చేసి ఉండాలని తెలిపారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 31లోపు ఇన్నోవేట్‌ఇండియా.మైజీవోవీ.ఇన్/పీఎం–యోగా–అవార్డ్స్–2025 సైట్ నుంచి ఇతర వివరాలను పొంది, అదే సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నరసరావుపేటటౌన్: మీటర్ రీడర్స్ అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సంఘ ప్రతినిధులు మంగళవారం విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ రాంబొట్లను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం జిల్లా కార్యదర్శి షేక్ యాసిన్, జాయింట్ సెక్రటరీ శివసాయి మాట్లాడుతూ మీటర్ రీడర్స్‌కి కనీస వేతనం అమలు చేయాలన్నారు. మీటర్ రీడర్స్‌కి ఎస్క్రో అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించాలన్నారు. రిచార్జి స్మార్ట్ మీటర్లు వస్తున్న తరుణంలో మీటర్ రీడర్స్ అందరికీ సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలన్నారు. గత 20 ఏళ్లుగా చాలీచాలని జీతంతో పనిచేస్తున్నామని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. తమ సంఘం రాష్ట్రవ్యాప్త ప్రథమ మహాసభ అనంతరం కార్యాచరణ ప్రకటించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా మీటర్ రీడర్స్ కార్మికులు మార్చి 18న డీఈ ఆఫీస్ ముందు ధర్నా, 20న ఎస్ఈ ఆఫీసు ముందు ధర్నా, 24న కలెక్టర్‌కు సమస్యలపై వినతి పత్రం సమర్పించడం, 27న సీఎండీ కార్యాలయం ముందు ధర్నా తదితర కార్యాచరణ రూపొందించామన్నారు.

23న దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్ష

- దరఖాస్తు చేయకున్నా సాధారణ ఫీజు రూ.500తో అదే రోజు పరీక్ష హాజరు కావచ్చు
- రాష్ట్రవ్యాప్తంగా ఏడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- ఏపీ ఐసెట్ ర్యాంకర్లు నేరుగా ప్రవేశాలు పొందవచ్చు
- దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు



ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున విద్యాలయం దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో 2025 విద్యా సంవత్సరానికి గాను రెండేళ్ల మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) కోర్సుల్లో ప్రవేశ పరీక్ష షెడ్యూల్ మంగళవారం విడుదల చేసినట్లు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు ప్రవేశ పరీక్ష వివరాలను వివరించారు. ఈనెల 23న ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఏడు పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని చెప్పారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు చేయని అభ్యర్థులు నేరుగా టెన్త్ క్లాస్, డిగ్రీ ప్రొవిజినల్, మార్కుల జాబితా అభ్యర్థి ఫొటోతోపాటు సాధారణ ఫీజు రూ.500 చెల్లించి, పరీక్ష జరిగే 23న నేరుగా హాజరు కావచన్నారు. సంబంధిత ప్రవేశ పరీక్ష ఫలితాలును ఈనెల 25 సాయంత్రం విడుదల చేస్తామని చెప్పారు.

ప్రవేశ పరీక్ష కేంద్రాలు

సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (గుంటూరు), ఆదిత్య డిగ్రీ కాలేజ్ (కాకినాడ), ఎం ఎస్ ఆర్ ఎస్ సిద్ధార్థ డిగ్రీ కాలేజ్ (విశాఖపట్నం), గీతం డిగ్రీ కాలేజ్ (ఒంగోలు), గేట్ డిగ్రీ కాలేజ్ (తిరుపతి), శ్రీ విజయ దుర్గ డిగ్రీ కాలేజ్ (కర్నూలు), శ్రీ సాయి డిగ్రీ కాలేజ్ (అనంతపూర్) మొత్తం ఏడు పరీక్ష కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు.ఏపీ ఐసెట్ 2024లో అర్హత సాధించిన అభ్యర్థులు నేరుగా ఈ కోర్సుల్లో అడ్మిషన్లు పొందవచ్చు. ప్రత్యేకంగా ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు.

అర్హతలు

దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కనీస విద్యార్హతలు కలిగి ఉండాలి. రెండేళ్ల వ్యవధి ఎంబీఏ జనరల్ కోర్సులకు ఏదైనా సబ్జెక్టులో డిగ్రీ కలిగి ఉండాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డిగ్రీలో 45 శాతం, మిగిలిన వారు 50 శాతం ఉత్తీర్ణత శాతం కలిగి ఉండాలని సూచించారు.

ఎంబీఏలో రెండు స్పెషలైజేషన్స్

ఎంబీఏ జనరల్‌లో ఫైనాన్స్, మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్మెంట్, బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ మేనేజ్మెంట్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ట్రావెల్ టూరిజం మేనేజ్మెంట్, బిజినెస్ ఎనాలిటిక్స్, ఇంటర్నేషనల్ బిజినెస్ మేనేజ్మెంట్ మొత్తం 8 స్పెషలైజేషన్స్ ఉన్నాయి. అందులో రెండిటిని మాత్రమే ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.

– ఎంసీఏ కోర్సులకు పది తర్వాత ఇంటర్, డిగ్రీ లేదా ఇంజనీరింగ్, డిప్లొమా తర్వాత డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. ఎంసిఏ కోర్సులకు డిగ్రీలో తప్పనిసరిగా మ్యాథ్స్ చదివి ఉండాలి. దూర విద్యలో మ్యాథ్స్ డిగ్రీ చదివిన వారిని కూడా అర్హులుగా గుర్తిస్తారు. డిగ్రీలో మ్యాథ్స్ చదవని విద్యార్థులు ఇంటర్‌లోనైనా మ్యాథ్స్ సబ్జెక్టును చదివి ఉండాలి అని వెల్లడించారు. ఉమ్మడి ప్రవేశ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు వర్సిటీ వెబ్సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌యూసీడీఈ.ఇన్ఫో నుంచి హాల్ టికెట్లను, ర్యాంక్ కార్డులు పొందవచ్చు అన్నారు. మరిన్ని వివరాలను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూర విద్య కేంద్రం ఏఎన్‌యూసీడీఈ.ఇన్ఫో అధికారిక వెబ్సైట్ నుండి, ఫోన్ నంబర్స్ – 9848477441, 0863–2346323 సంప్రదించవచ్చని డైరెక్టర్ చార్య వెంకటేశ్వర్లు తెలిపారు.

12వ పీఆర్సీ చైర్మన్‌ను తక్షణమే నియమించాలి

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: పన్నెండో వేతన సవరణ సంఘాని(పీఆర్సీ)కి తక్షణమే చైర్మన్‌ను నియమించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన సంఘ ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. తొమ్మిది నెలల క్రితం అధికారంలోకి రాక ముందు, తక్షణమే పీఆర్సీ కమిషన్‌ను నియమిస్తామని, సకాలంలో డీఏలు ఇస్తామని హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చాక విస్మరించారని ఆరోపించారు. ఇప్పటికీ 12వ పీఆర్సీ చైర్మన్‌ను నియమించకపోవడం దారుణమన్నారు. 12వ పీఆర్సీ చైర్మన్‌ను నియమించి, విధి విధానాలను అప్పగించి, సంఘాలతో చర్చలు జరిపి ఐఆర్ ప్రకటించి అమలు చేసేందుకు మరింత జాప్యం నెలకొనే పరిస్థితులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన మూడు డీఏలు ఇప్పటికీ చెల్లించలేదని, మరొక డీఏ జూలైకి రాబోతుందని, ఇప్పటికైనా డీఏలను తక్షణం చెల్లించాలని కోరారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం 2017లో ఇచ్చిన మెమో 57ని ఇంత వరకు అమలు చేయకపోవడం పట్ల తీవ్ర వ్యతిరేకత ఉందని తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా యూటీఎఫ్ ఉద్యమ కార్యాచరణ తీసుకుంటుందని హెచ్చరించారు. సంఘ రాష్ట్ర ప్రచురణ విభాగ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రతి గ్రామ పంచాయతీకి ఒక మోడల్ ప్రాథమిక పాఠశాలలను అన్ని హంగులతో ఏర్పాటు చేయాలని, మిగిలిన ప్రాథమిక పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. 60 మంది విద్యార్థులు దాటిన ప్రాథమికోన్నత పాఠశాలలను హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేసి, మిగిలిన యూపీ పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో సమాంతర మీడియాలను కొనసాగిస్తూ ప్లస్ 2 పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలన్నారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్, జిల్లా సహాధ్యక్షురాలు వై. నాగమణి, కోశాధికారి ఎండీ దౌలా, జిల్లా కార్యదర్శులు ఆదినారాయణ, సాంబశివరావు, గోవిందయ్య, ఆంజనేయులు, షకీలా బేగం, కేదార్ నాథ్, రంగారావు, ప్రసాద్, ఆడిట్ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, కోటిరెడ్డి, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

కారు బీభత్సం



కారు వెనుక భాగంలో చల్లావారిపాలెం టిడిపి అధ్యక్షుడు అని స్టిక్కర్ ఉన్న దృశ్యం



కారును ఢీ కొట్టడంతో నుజునుజ్జు అయిన దృశ్యం

ఒక కారు, మూడు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టిన వైనం

- చల్లావారిపాలెం టీడీపీ అధ్యక్షుడు పేరుతో కారుపై స్టిక్కర్
- ఘటనాస్థలం నుంచి పరారైన కారు నడిపిన వ్యక్తి
- కొద్దిసేపటికి తానే ప్రమాదానికి కారణమంటూ స్టేషన్‌కు రాక..
- వచ్చిన వ్యక్తి, కారు నడిపిన వ్యక్తి ఒకరా కాదా అని పరిశీలిస్తున్న పోలీసులు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): అతివేగంతో ఓ కారు బీభత్సం సృష్టించింది. వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం సమయంలో కంకరగుంట ఫ్లైఓవర్ నుంచి ఏపీ 40 సీకే 5566 నెంబర్ గల కారు అతివేగంగా నగరంపాలెంలోని మూడు బొమ్మల సెంటర్ వద్దకు చేరుకుంది. ఈ కారుపై చల్లావారిపాలెం టీడీపీ అధ్యక్షుడు అనే స్టిక్కర్ ఉంది. ఈ కారు ఆ తర్వాత అదుపుతప్పి మూడు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టడంతోపాటు, ఒక కారును ఢీకొట్టింది. ఈ వాహనాలు తక్కుతుక్కయ్యాయి. ఘటనలో ఒక ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మూడేళ్ళ చిన్నారి కీర్తన, ఆమె తండ్రి ఏలియాకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే వాహనదారులు, స్థానికులు గుమికూడటంతో కారు నడుపుతున్న వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. ఆ తర్వాత కొద్దిసేపటికి ఒక వ్యక్తి వచ్చి ప్రమాదం చేసింది తానేనని స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం. కారు ప్రమాదం జరిగిన సమయంలో డ్రైవింగ్ చేసిన వ్యక్తి, ఇతను ఒకరా కాదా అని పోలీసులు పరిశీలిస్తున్నారు. ఘటన స్థలిలో ఉన్న సీసీ ఫుటేజీల పరిశీలనతోపాటు స్థానికులను వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు విచారణ చేస్తున్నారు. బాధితుల నుండి ఫిర్యాదులు తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కారు కింద పడి తుక్కైన ద్విచక్ర వాహనం

ప్రభుత్వ నిర్ణయంపై నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నాయకులు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ఎస్సీ వర్గీకరణపై రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ఇచ్చిన నివేదికను రాష్ట్ర కేబినెట్ ఆమోదించిన తీరును నిరసిస్తూ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో గుంటూరు లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల రిబ్బన్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ వర్గీకరణ ద్వారా మాల, మాదిగలను విడదీస్తే సహించేది లేదని హెచ్చరించారు. వర్గీకరణ రాష్ట్ర యూనిట్‌గా తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. లక్ష మందితో రాజధానిలో నిరసన సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాల సంఘం జిల్లా అధ్యక్షులు దార హేమ ప్రసాద్, రాష్ట్ర మహిళా నాయకురాలు పిల్లి మేరి, ఏల్చూరి వేణు, బోరుగడ్డ రజనీకాంత్, పల్లె మురళి భీమ్ సేన సేవాదళ్ నల్లపు నీలాంబరం, ఉద్యోగ సంఘ నాయకులు కోడి రెక్క, కోటి రత్నం, రాచకొండ ముత్యాలరాజు, కార్యంశెట్టి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల నిష్పత్తి పెంచాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, తదితరులు

గుంటూరు మెడికల్ : మగపిల్లలతో పోలిస్తే ఆడపిల్లల నిష్పత్తి తక్కువగా ఉంటుందని, పెంపునకు కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి చెప్పారు. గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో గర్భస్థ లింగ నిర్ధారణ నిరోధక చట్టం అమలు, జెండర్ వైలెన్స్‌పై ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రు నిర్వాహకులు, వైద్యులతో సమావేశం జరిగింది. జిల్లా మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ సభ్యులు, సలహా సంఘ సభ్యులకు, ప్రసూతి వైద్య నిపుణులు సమావేశంలో పాల్గొన్నారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ నిరోధక చట్టం అమలు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతని చెప్పారు. జీజీహెచ్ గైనకాలజి ప్రొఫెసర్ డాక్టర్ పి.జయంతి మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లు నిర్వహించాల్సిన రిజిస్టర్లు, జిల్లాకు పంపాల్సిన రిపోర్టులు, పాటించాల్సిన నియమాల గురించి వివరించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగమణి మాట్లాడుతూ పీసీపీఎన్‌డీటీ చట్టం అతిక్రమిస్తే విధించే శిక్షల గురించి వివరించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, తెనాలి డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అన్నపూర్ణ, డెమో ఎ.జయప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలకు పదును పెట్టాలి



మాట్లాడుతున్న ఏఎన్‌యూ వీసీ గంగాధరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు అంతర్గతంగా దాగిన నైపుణ్యాలకు పదును పెట్టాలని ఏఎన్‌యూ ఉప కులపతి ఆచార్య కె.గంగాధరరావు పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మంగళవారం ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా వీసీ గంగాధరరావు మాట్లాడుతూ జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకునే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి సూచించారు. కళాశాల కమిటీ అధ్యక్షుడు పోలిశెట్టి శ్యాం సుందర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. అనితాదేవి మాట్లాడుతూ విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈసందర్భంగా ఎంకాం విద్యార్థిని షేక్ షహనాజ్, ఎంబీఏ విద్యార్థి కె.అనంతలక్ష్మి, ఎమ్మెస్సీ మ్యాథ్స్‌లో వై.నాగమణి, ఫిజిక్స్‌లో బి.దుర్గా లావణ్య, కంప్యూటర్స్ సైన్స్‌లో కె.నాగసాయి రమ్య, కెమిస్ట్రీలో జుబేర్ అహ్మద్, ఎంసీఏ విద్యార్థి ఎస్. సాయిలీల ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. బీకాం జనరల్ విభాగంలో టాపర్‌గా నిలిచిన నరేంద్ర, బీకాం కంప్యూటర్స్‌లో షేక్ ఫారినా, బీఎస్సీ బీజెడ్‌సీలో షేక్ ఇషా సుల్తానా, బీబీఏలో జి.శ్వేత, ఇంటర్మీడియెట్ ఎంపీసీలో టాపర్ పి. గౌస్య ప్రతిభా పురస్కారాలు పొందారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, అధ్యాపకులు బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, డీవీ చంద్రశేఖర్, ఎస్. శ్రీనివాసరావు, యు. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చలపతి ఎడ్యుకేషన్ సొసైటీ 30 ఏళ్ల మహోత్సవం



పోస్టరు విడుదల చేస్తున్న చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, సిబ్బంది

మోతడక(తాడికొండ): చలపతి ఎడ్యుకేషన్ సొసైటీ స్థాపించి 30 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 12–22 వరకు తమ అన్ని బ్రాంచిలలో 4 రోజుల పాటు చలపతి మహోత్సవం పేరిట సంబరాలు నిర్వహిస్తున్నట్లు చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు తెలిపారు. మంగళవారం మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో పలువురు ప్రిన్సిపల్స్, అధ్యాపకులతో కలిసి ఆయన పోస్టరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలపతి మహోత్సవంలో భాగంగా ఈ నెల 19న ఐడియాథాన్, 20న వివిధ అంశాలలో సాంకేతిక పరమైన పోటీలు 21–22 తేదీలలో క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని సదావకాశం ఉపయోగించుకొని తమ ప్రతిభ నిరూపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల కార్యదర్శి వై సుజిత్ కుమార్, డైరెక్టర్‌లు డి వినయ్ కుమార్, కె శ్రీనివాసరెడ్డి, జి సుబ్బారావు, ప్రిన్సిపల్స్ డాక్టర్ కె నాగ శ్రీనివాసరావు, డాక్టర్ ఎం చంద్రశేఖర్, అకడమిక్ డీన్‌లు, వివిధ శాఖాధిపతులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతిపై కేసు



గుంటూరు రూరల్: వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనపై నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. సీఐ వంశీధర్ కథనం ప్రకారం నల్లపాడు గ్రామానికి చెందిన రాజుకు, మామిళ్ళపల్లికి చెందిన సృజన (23)తో ఏడాది క్రితం వివాహమైంది. ఇటీవల నుంచి భార్యాభర్తల మధ్య నిత్యం గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సృజన మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలిసిన సృజన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు భర్తే తమ కుమార్తెను చంపాడని, ఉరివేసుకుందని సృష్టించాడని ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. రాజును అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

చిట్‌ఫండ్ బాధితుల విచారణ

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): నరసరావుపేటలోని సాధన చిట్‌ఫండ్ బాధితులను సీఐడీ గుంటూరు ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం విచారణ చేశారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఎప్పటి నుంచి చిట్‌లు వేస్తున్నారు? ఎంత మొత్తంలో నెల నెలా చెల్లిస్తున్నారనే అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు సుమారు 15 మందికిపైగా బాధితుల వద్ద వివరాలు సేకరించారు. అలాగే నరసరావుపేటలోని ఓ ప్రైవేటు బ్యాంక్ ప్రతినిధులు కూడా తమ గోడును సీఐడీ అధికారులకు వినిపించారు.

అప్పుల బాధ తాళలేక మహిళ ఆత్మహత్య

దామరపల్లి(తాడికొండ): వ్యవసాయంలో నష్టం రావడంతో అప్పుల బాధ పెరిగి కుటుంబ పోషణ భారంగా మారడంతో మహిళ ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటన తాడికొండ మండలం దామరపల్లి గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తాడికొండ మండలం దామరపల్లి గ్రామానికి చెందిన వట్టికూటి శ్రీనివాసరావు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. గత కొన్నేళ్లుగా వ్యవసాయంలో నష్టం వస్తుండటంతో ఉన్న 3 ఎకరాలు అమ్మి అప్పులు తీర్చారు. కౌలుకు పొలం తీసుకొని వ్యవసాయం చేస్తుండగా ఈ ఏడాది కూడా తీవ్రంగా నష్టం రావడంతో మనస్థాపం చెందారు. అప్పు ఇచ్చిన వారు ఒత్తిడికి గురిచేస్తుండటంతో కుటుంబ పోషణ కూడా కష్టంగా మారడంతో శ్రీనివాసరావు భార్య అరుణ కుమారి మనస్థాపంతో పొలానికి వేసేందుకు తెచ్చిన గడ్డిమందు తాగి ఈనెల 14న ఆత్మహత్యకు పాల్పడింది. గుంటూరులోని ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా మంగళవారం ఉదయం మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతులకు రిజర్వ్ ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికి ముగ్గురి వద్ద నుంచి రూ.13 లక్షలు నగదు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసుల కథనం ప్రకారం.. ఆంజనేయ పేట ప్రాంతంలో రుద్రా ఫౌండేషన్ యజమాని అయిన అరమండ రవికుమార్ అనే వ్యక్తి 2022లో ఉద్యోగవకాశాల పేరుతో పత్రికా ప్రకటనలు చేశాడు. ఆ ప్రకటనలు చూసిన పల్నాడు జిల్లా యడ్లపాడుకు చెందిన పాలపర్తి కోటేశ్వరమ్మ రవికుమార్‌ను కలిశారు. అతని మాయమాటలు నమ్మి రూ.5లక్షలు చెల్లించారు. అలాగే గడ్డల వంశీ అనే వ్యక్తి రూ.3 లక్షలు, గొట్టిపాటి మరియదాసు అనే వ్యక్తి రూ.5 లక్షలు రవికుమార్‌కు ఇచ్చారు. అయితే ఆ తర్వాత ఉద్యోగాలు రాకపోవడంతో మోసపోయినట్టు గుర్తించిన బాధితులు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టాభిపురం సీఐ పోస్టుపై సందిగ్ధం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): పశ్చిమ సబ్ డివిజన్‌లోని పట్టాభిపురం పీఎస్ సీఐ పోస్టుపై సందిగ్ధం నెలకొంది. వీఆర్‌లో ఉన్న సీఐ ఎం.మధుసూదనరావును ఈనెల 16న పట్టాభిపురం పీఎస్ సీఐగా నియమిస్తూ ఓ పోలీస్ ఉన్నతాధికారి నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అప్పటి వరకు విధుల్లో ఉన్న వీరేంద్రబాబును సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఈ క్రమంలో కొత్త సీఐగా మధుసూదనరావు అదే రోజు రాత్రి స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. అయితే గుంటూరు రేంజ్ కార్యాలయం నుంచి ఈ పోస్టింగ్‌కు బ్రేక్‌పడినట్లు తెలుస్తోంది. దీంతో సందిగ్ధం నెలకొంది. బుధవారం సాధ్యమైనంత వరకు ఆయనే మళ్లీ సీఐగా కొనసాగే అవకాశాలు ఉన్నాయని సమాచారం.



మేదరమెట్లలో ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ పార్థీవదేహం వద్ద మంగళవారం నివాళి అర్పిస్తున్న అంబటి రాంబాబు

గడ్డిమందు తాగి రైతు ఆత్మహత్య

పిడుగురాళ్ల: గడ్డిమందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గుత్తికొండ గ్రామంలో చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి ఎస్ఐ మోహన్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గుత్తికొండ గ్రామానికి చెందిన పరిటాల పోతురాజు(60) అనే రైతు గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతోపాటు మతిస్థిమితం సక్రమంగా లేకపోవటం వలన సోమవారం రాత్రి గడ్డిమందు తన ఇంట్లోనే తాగాడు. గమనించిన భార్య హనుమాయమ్మ వెంటనే హుటాహుటిన పిడుగురాళ్ల ప్రైవేటు హాస్పటల్‌కు తరలించింది. ప్రథమ చికిత్స అనంతరం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం గుంటూరు జీజీహెచ్‌లో మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి కుమారుడు పరిటాల రామలింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్ పేర్కొన్నారు.